పేదింటి విద్యా కుసుమాలు

పేదరికం ప్రతిభకు ఏమాత్రం అడ్డు కాదని నిరూపించారు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు. కాస్త తోడ్పాటు అందిస్తే ఎవరికీ తీసిపోమని నిరూపించారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సహకారానికి తోడు చక్కని ప్రణాళికతో ఇష్టపడి చదివితే ఎంతటి విజయాలనైనా సొంతం చేసుకోవచ్చని చూపించారు. రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీలకు తూర్పు నియోజకవర్గం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. వారిలో ముగ్గురు మరింత ఉన్నత చదువులకు అవకాశం రావడంతో అటువైపు అడుగులు వేశారు. వారంతా చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటామని అంటున్నారు.



తోటగరువు జెడ్పీ హైస్కూల్(ఇన్‌సెట్) తరగతి గదిలో విద్యార్థులు

- తూర్పు నియోజకవర్గం నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపిక
- ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో 2023–24 విద్యా సంవత్సరంలో పలు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదివిన వారిలో ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు. వారిలో ఇద్దరు మాత్రమే ట్రిపుల్ ఐటీ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేడీపీఎం ఉన్నత పాఠశాల, ఏయూ తెలుగు మీడియం, ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ఐదుగురు విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించారు. వారిలో కేడీపీఎం, ఏయూ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో చేరడానికి దరఖాస్తు చేసుకోలేదు. ఓ విద్యార్థి సీఏ చదవాలని ఆసక్తి, మిగతా ఇద్దరికి మరో ఉన్నత విద్యపై ఆసక్తి ఉండడంతో ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేయలేదు.

- తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 427 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాశారు.

వారిలో కె.రత్నసావియా 584/600, టి.రామ్‌చరణ్ 579/600 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వారిద్దరూ న్యూజివీడులో ట్రిపుల్ ఐటీ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఇటీవల విడుదలపై ఫలితాల్లో ఎంపికయ్యారు. ఈ నెల 23న కౌన్సెలింగ్ కోసం పిలుపు వచ్చింది. ఆ ఇద్దరు విద్యార్థులు తమ తల్లిదండ్రులను తీసుకుని నూజివీడు వెళ్లి ప్రవేశం పొందాలని సన్నాహాలు చేసుకుంటున్నారు.

సివిల్స్ సాధనే లక్ష్యం



తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7 నుంచి 10వ తరగతి వరకు చదివా. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 584 మార్కులు సాధించాను. ఇందుకు ఉపాధ్యాయుల బోధనలు, సూచనలు ఉపయోగపడ్డాయి. అమ్మ రజనీ తోటగరువులో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్నారు. తండ్రి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వారి కష్టాలను దగ్గర్నుంచి చూశాను. ట్రిపుల్ ఐటీలో ఎంపీసీ తీసి ఇంజినీరింగ్ చేస్తా. తర్వాత యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమై సివిల్స్ సాధనే లక్ష్యంగా చదువుతా.

– తల్లి రజనితో కె.రత్నసావియా(తోటగరువు)

సాఫ్ట్‌వేర్ ఇంజనీరవుతా..



తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 579/600 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో రెండో స్థానంలో నిలిచా. అమ్మ వెంకటలక్ష్మి కష్టంతో నేను, చెల్లి చదువుకుంటున్నాం. 6 నుంచి 10వ తరగతి వరకు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివా. మా తల్లి ఓ షాపులో హౌస్ కీపింగ్ పని చేస్తున్నారు. చెల్లి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే పదో తరగతి చదువుతోంది. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం ఆనందంగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీరై కుటుంబానికి చేదోడుగా ఉంటాం.

– తల్లి వెంకటలక్ష్మితో టి.రామ్‌చరణ్(రవీంద్రనగర్)

ఘనంగా ముత్యాలమ్మ జాతర



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ శివాజీనగర్–2లో ముత్యమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. బుధవారం ప్రారంభమైన ఈ జాతర కోసం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆరిలోవ కాలనీ, నలభై గజాల రోడ్డు, శివాజీనగర్–1, 2, శ్రీకాంత్‌నగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు గురువారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కెల్ల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల సత్యనారాయణ, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం డప్పులు, వాయిద్యాలు, పులివేషాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పిల్లి వీర్రాజు, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువులో రోడ్లు, కాలువల నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.40 లక్షలతో తోటగరువులో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించనున్నట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీ కాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాల గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు https://ignouadmission.samarth.edu.in/ ను సందర్శించి.. ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు జూలై 31వ తేదీతో గడువు ముగుస్తుందని, పూర్తి వివరాలకు ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

కుష్టురహిత జిల్లాయే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : ఇంటింటికీ తిరిగి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో వైద్యాధికారులు, డాటా ఎంటీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఆశ కార్యకర్త, ఇతర సిబ్బంది డోర్ టు డోర్ సర్వేకు పూర్తి సహకారం అందించాలన్నారు. విశాఖ జిల్లాను కుష్టు రహిత జిల్లాగా మలచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, డాక్టర్ కె.సత్యవేణి, కె.వి. రమణ, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పేరుకుపోయిన పూడిక



పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్డు పక్కన కాలువలో పేరుకుపోయిన పూడిక

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో సర్వీసు రోడ్డు పక్కన ఉన్న కాలువ పూడికలతో నిండిపోయింది. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీరు ప్రవాహానికి ఆటంకంగా మారింది. కాలువలో ఉన్న చెత్త ఎక్కడికక్కడ నిలిచిపోయింది. తక్షణం పూడిక తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న విజయ్ భాస్కర్

పెందుర్తి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సమగ్ర శిక్ష రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కర్ సూచించారు. తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టీచ్ టూల్' పేరిట జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 120 మంది హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలకు తొమ్మిది రోజుల శిక్షణ తరగతులను పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన అబ్జర్వేషన్లలను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని చెప్పారు. డీఈవో చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి సువర్ణ, జిల్లా సహాయ ఏఎంవో జి.లక్ష్మి, పెందుర్తి ఎంఈవో–2 మధుమూర్తి పాల్గొన్నారు.

మూలకు చేరిన వాటర్ ఫౌంటెన్



పెదగదిలి వద్ద పని చేయని వాటర్ ఫౌంటెన్

ఆరిలోవ: పెదగదిలి వద్ద వాటర్ ఫౌంటెన్ మూలకు చేరింది. ఏడాదిగా రంగు రంగుల నీరు పైకి విరజిమ్ముతూ వాహనచోదకులను, స్థానికులను కనువిందు చేసే ఈ వాటర్ ఫౌంటెన్ సుమారు మూడు వారాలుగా పని చేయడం మానేసింది. దీంతో రాత్రి పూట దీని అందాలు కానరావడం లేదు. గతేడాది జీవీఎంసీ అధికారులు నగరంలో ప్రధాన కూడళ్ల ఆధునికీకరణ చేపట్టారు. ఇందులో భాగంగా బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలిలో ఉన్న పెద్ద నుయ్యిపై ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. ఇది సాయంత్రం 6 గంటల నుంచి నీలం, పసుపు, గులాబీ, ఆకుపచ్చ తదితర రంగుల దీపాద్దీపాల వెలుగులతో నీరు పైకి విరజిమ్మి స్థానికులు, అటుగా ప్రయాణించే వాహనచోదకులకు కనువిందు చేసేది. రూ.లక్షలు ఖర్చు చేసిన ఏర్పాటు చేసిన ఈ ఫౌంటెన్ మూన్నాళ్ల ముచ్చటగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు కొద్ది రోజులుగా దీని నిర్వహణ గురించి పట్టించుకోకపోవడం వల్లే మూలకు చేరిందని ఆరోపిస్తున్నారు. ఈ నెల 20న సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షిణ కోసం తిరిగే భక్తులను కనువిందు చేయడానికైనా ఈ వాటర్ ఫౌంటెన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యూపీహెచ్‌సీల తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం నగరంలోని పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. చిన్నవాల్తేరు, దుర్గాబజార్, తోటగరువు, కొబ్బరితోట తదితర ప్రాంతాల్లో ఉన్న యూపీహెచ్‌సీలను ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదే విధంగా ఎనీమియాపై ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో మాట్లాడారు. లబ్ధిదారులను గుర్తించి వారికి మాత్రలు అందజేయాలని తెలిపారు. అన్ని యూపీహెచ్‌సీల్లోను సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, స్టాప్ డయేరియా ప్రోగ్రాంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ వర్షాకాలంలో కీటకజనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, డీఐవో, డాక్టర్ రమారెడ్డి, డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) ఎం.నాగేశ్వరరావు, పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, ప్రైవేటు ఆస్పత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు పక్కాగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న జెడ్సీ శైలజావల్లి

మధురవాడ : గిరి ప్రదక్షిణకు ఉన్నతాధికారులు నిర్దేశించిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ శైలజావల్లి చెప్పారు. గురువారం మధురవాడ జోనల్ కార్యాలయంలో ఆమె వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, సూచనలు చేశారు. జోన్ పరిధిలోని శ్రీకృష్ణాపురం పరిసర ప్రాంతాల నుంచి తెన్నేటి పార్కు వరకు గల రోడ్డుపై అవసరమైనచోట మరమ్మతులు చేపట్టాలని, రోడ్డు పక్కన్న ఉన్న ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. 32 చోట్ల తాగునీటి స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి విభాగం అధికారి, సిబ్బంది కేటాయించిన పనులు నిర్లక్ష్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిషోర్, సూపరింటెండెంట్ అప్పలరాజు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో విలువైన ప్రాణాలకు రక్షణ



చంద్రంపాలెం హైస్కూల్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి వెంకట శేషమ్మ

మధురవాడ : ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరిస్తే విలువైన ప్రాణాలకు రక్షణగా నిలుస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం.వెంకట శేషమ్మ అన్నారు. మధురవాడ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాల, గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాలతో పాటు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెల్మెట్ ధారణ – రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలు తెలుసుకోవడంతోపాటు విధిగా పాటించాలన్నారు. డీఎల్ఎస్ ప్యానల్ మెంబర్లు సీహెచ్ స్వర్ణ గౌరీమణి, రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల అందరికీ మేలు జరుగుతుందన్నారు. గాయత్రి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే గో స్వామి, చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు పాల్గొన్నారు.

23న భూలోకమాత పండగ

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం గ్రామ ఇలవేల్పు శ్రీభూలోకమాత అమ్మవారి వార్షిక పండగ ఈ నెల 23న జరగనుంది. ఈ మేరకు ఆలయాన్ని రంగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. ఈ నెల 22న తొలేళ్లు, 23న అనుపోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎర్రమట్టి దిబ్బల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

సీతంపేట: అధికారుల సహకారంతోనే సహజ వనరుల దోపిడీ జరుగుతోందని, ఉదాసీనత వహిస్తే వారిపై కేసులు వేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జాతీయ గనుల మంత్రిత్వ శాఖ దేశంలో ప్రముఖ జ్యూలాజికల్ హెరిటేజ్ సైట్స్ లిస్టు చేస్తూ 32 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వాలు సంరక్షించి నిర్వహణ చేయాలని 2016లో గనుల శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందులో ముఖ్యమైన ఎర్రమట్టి దిబ్బలను రక్షించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ విషయంలో పార్టీలకతీతంగా సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వారసత్వ సంపదగా గుర్తించిన ఎర్రమట్టి దిబ్బల సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ఈ వారసత్వ సంపద వినాశనానికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఎర్రమట్టి దిబ్బలను సర్వేచేసి బఫర్ జోన్ గుర్తించాలని తెలిపారు.

హాస్టళ్లలో పరిశుభ్రత లోపిస్తే చర్యలు



మధురవాడ కళాశాల బాలుర వసతి గృహంలో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీడీ రామారావు

మధురవాడ : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పరిశుభ్రత, నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం మధురవాడ సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహం, కళాశాల బాలుర వసతి గృహం–1లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థులుండే గదుల్లోనే దుస్తులు ఆరబెట్టడం, అపరిశుభ్ర వాతావరణాన్ని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పక్కనే ఉన్న సమీకృత వసతి గృహం కూడా పరిశీలించారు. వార్డెన్ నిత్యం అప్రమత్తంగా వుంటూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉందన్నారు.

నిజాయితీపరుడికి అభినందన



ఈశ్వరరావును సత్కరించి నగదు బహుమతి అందజేస్తున్న ఆరిలోవ సీఐ గోవిందరావు

ఆరిలోవ: ఆరిలోవలో ఓ వ్యక్తి తన నిజాయితీతో పోలీసుల అభినందనలు పొందాడు. వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవకు చెందిన ఈశ్వరరావు గురువారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఓ ఏటీఎంకు డబ్బులు తీయడానికి వెళ్లారు. ఆయన వెళ్లేసరికి ఏటీఎంలో ఎవరూ లేరు. కానీ ఏటీఎం యంత్రం ఆపరేటింగ్ బాక్స్‌లో రూ.5 వేలు నగదు ఉంది. ఆ నగదు తీసుకొని నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడ సీఐ గోవిందరావుకు అందజేశారు. ఈ డబ్బులు ఎవరో ఏటీఎంలో డ్రా చేసి మరిచిపోయారని, వారికి తిరిగి అందజేయాల్సిందిగా కోరారు. దీంతో అక్కడ సీఐతో పాటు పోలీసులు ఆశ్చర్యపోయారు. ఈశ్వరరావు నిజాయితీని అభినందించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావును శాలువతో సత్కరించి కొంత నగదు రివార్డుగా ఇచ్చి గౌరవించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దొరికిన డబ్బులను తీసుకొని జేబులో వేసుకోకుండా పోగొట్టుకొన్నవారికి తిరిగి అందజేయాలన్న తన నిజాయితీకి ఇది నిదర్శనమన్నారు. ఏటీఎంలో డబ్బులు పోగొట్టుకొన్నవారు పోలీస్ స్టేషన్‌లో ఆధారాలతో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నర్సింహమూర్తి, కానిస్టేబుల్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తీరం అల్లకల్లోలం

రుషికొండలో నిలిచిన బోటు షికారు



అల్లకల్లోలంగా మారిన తీరం

కొమ్మాది: బంగాళాఖాతంలో అల్ప పీడనం కారణంగా సాగర్‌నగర్, రుషికొండ, మంగమారిపేట, ఉప్పాడ, భీమిలి సముద్ర తీరం గురువారం సాయంత్రం అల్లకల్లోలంగా మారింది. సముద్ర కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో పాటు బలంగా గాలులు వీయడంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. తమ విలువైన బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వాతావరణంలో మార్పులతో రెండు రోజుల పాటు వేటకు విరామం చెప్పినట్లు మత్స్యకారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. రుషికొండ బీచ్‌లో బోటు షికారును నిలిపివేశారు. సముద్రంలో పెద్ద ఎత్తున అలలు ఎగసి పడటంతో బోటు షికారు నిలిపివేశామని, పర్యాటకులు గమనించాలని నిర్వాహకులు సూచించారు. బోట్లను తీరంలో భద్రపరిచారు.

20న ఉక్కు కేవీలో ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఈనెల 20న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. పీజీటీ విభాగంలో కామర్స్, ఎకనామిక్స్, టీజీటీ విభాగంలో ఇంగ్లిష్, సంస్కృతం, సైన్స్, సోషల్ సైన్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు అన్ని ధ్రువ పత్రాలతో ఆ రోజు విద్యాలయానికి హాజరు కావాలన్నారు.

ప్రయోగాత్మక హాల్ట్‌ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు ఆయా స్టేషన్లలో కల్పించిన ప్రయోగాత్మక హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. భువనేశ్వర్–సికింద్రాబాద్(17015) విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు సత్తెనపల్లె, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌లలో హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగించారు. విశాఖపట్నం–మహబూబ్‌నగర్ (12861) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు మధిర స్టేషన్‌లో హాల్ట్‌ను కొనసాగించారు. పూరీ–తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్‌కు, బిలాస్‌పూర్–తిరుపతి(17481) ఎక్స్‌ప్రెస్‌కు చిన్న గంజాం స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది. గుంటూరు–రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్‌కు భీమడోలు స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది.

కొచ్చువేలి-బరౌని మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొచ్చువేలి-బరౌని మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. కొచ్చువేలి -బరౌని (06091) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొచ్చువేలిలో ఈ నెల 20న ఉదయం 8 గంటలకు బయల్దేరి 21న ఉదయం 11.45 గంటలకు దువ్వాడకు.. 22న మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బరౌని–కొచ్చువేలి (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బరౌనిలో ఈ నెల 23వ తేదీ 11.30 గంటలకు బయల్దేరి మూడో రోజు తెల్లవారు 5.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5.30 గంటలకు బయల్దేరి శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటకు కొచ్చువేలి చేరుకుంటుంది.

తెరిపివ్వని వర్షం

మద్దిలపాలెం : వర్షంతో మద్దిలపాలెం పరిసర ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. రహదారులు జలమయమయ్యాయి. వర్షపు నీటితో కాలువలు పొంగిపొర్లాయి. కాలువలో వ్యర్థాలు రోడ్లపై పేరుకుపోయాయి. మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, శివాజీపాలెం, పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్లలో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు స్థానికులు నానా అవస్థలు పడ్డారు.

'విశాఖపట్నం-పలాస' గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం -పలాస (07470) మెము రైలు ఈ నెల 22, 25, 27వ తేదీల్లో శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో పై తేదీల్లో పలాస–విశాఖపట్నం(07471) మెము రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరుతుంది.

అప్రమత్తంగా ఉండండి



సచివాలయాల మహిళా పోలీసులకు సూచనలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: సచివాలయ మహిళా పోలీసులు తమ పరిధిలో అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎస్.విజయకుమార్ సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం స్టేషన్ పరిధిలోని 35 సచివాలయాల మహిళా పోలీసులకు కొత్త చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలపై దృష్టి సారించాలన్నారు. మద్యానికి బానిసలైన వారు ఎవరైనా ఉంటే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. చీటీలు వేసిన వారి పేర్లు తెలియజేయాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ఎక్కువ నిఘా పెట్టాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. హెల్మెట్ ధరించని వాహన చోదకులు, వాహన పత్రాలు సక్రమంగా లేని వారు, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసిన వారు, వాహనాలు నడిపే మైనర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, ప్రమీల పాల్గొన్నారు.